క్లుప్తంగా

సాగునీరు అందించండి



ఎమ్మెల్యే అశోక్‌తో మాట్లాడుతున్న రైతులు

యానాం: దళితులకు ప్రభుత్వం ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీల ద్వారా కేటాయించిన భూములకు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పలువురు రైతులు శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కలసి విన్నవించుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎస్సీ రైతులకు ఏవిధమైన సహకారం అందడం లేదని వ్యవసాయ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కనీసం సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అశోక్ పీడబ్ల్యూడీ అధికారులతో సమస్యపై మాట్లాడతానని, అదే విధంగా సొసైటీ భూముల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనకాలపేట, భీమ్‌నగర్ రైతులు దాసరి మంగ, కానేటి ధర్మారావు, గొల్లపల్లి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



సభలో మాట్లాడుతున్న కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: పరీక్షలంటే భయం వీడి, సానుకూల దృక్పథంతో విద్యార్థులు సాగాలని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. స్థానిక రవీంద్ర స్కూల్‌లో శుక్రవారం కోనసీమ సైన్స్ పరిషత్ 2,897వ మహా సభ ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు విద్యాపరమైన అంశాలపై సూచనలు చేశారు. చదువుకున్న పాఠ్యాంశాల్లో మెదడులో ఎంత వరకూ జ్ఞాపకం ఉంచుకుని సన్నద్ధం అవుతున్నామనేది అధ్యయనం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎలా ర్యాంకులు ఎలా సాధించాలో పలు చిట్కాలను ఆయన వివరించారు. పరీక్షల్లో సత్తా చాటేందుకు స్వచ్ఛందంగా ఎలా సిద్ధం కావాలో తెలిపారు. పరీక్షల్లో మార్కులు ఈ పరీక్ష పేపర్లను దిద్దే అధికారి దయతో కాదని, మన కఠిన శ్రమతో రాసే సమాధానాలకు ఇచ్చే మార్కులని గుర్తుంచుకోవాలని సూచించారు. ఏకాగ్రతతో చదివినప్పుడు తన తెలివితేటలను ప్రదర్శించే వేదిక పరీక్షా హాలు అని స్పష్టం చేశారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ గిడుగు నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సైన్స్ పరిషత్ మహాసభ జరిగింది.

శాంతి భద్రతలపై సమీక్ష

యానాం: పుదుచ్చేరి ఇండియన్ రిజర్వు బెటాలియన్ (ఐఆర్‌బీ) కమాండెంట్ మురుగవేలు శుక్రవారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమావేశ హాలులో పోలీస్ వెల్ఫేర్ తదితర అంశాలపై చర్చించారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సైలు మురుగానందం, ఇలంగో, నూకరాజు తదితరులతో ఆయన శాంతిభద్రతలు తదితర వాటిపై సమీక్షించారు. పోలీసులు ప్రజలతో మంచి స్నేహ సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ గ్రామాల పెద్దలతో సమావేశం జరిపి వారి నుంచి వచ్చిన సూచనలను నమోదు చేశారు.

పొగ... సెగపాట్లు

- డంపింగ్ యార్డ్‌కు తరచూ నిప్పు
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతర్
- దుండగులపై చర్యలకు మున్సిపాలిటీ వెనకడుగు



అమలాపురం మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో చెత్తకు పెట్టిన నిప్పు

అమలాపురం టౌన్: ఆరోగ్యానికి పొగ పెట్టేస్తున్నారు.. ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.. అమలాపురంలో సేకరించిన చెత్తను పట్టణ బైపాస్ రోడ్డులోని శ్మశానవాటికను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. చెత్త రీసైక్లింగ్ విధానం పూర్తి స్థాయిలో జరగకపోవడంతో చెత్త కొండలా పేరుకుపోతుంది. ఈ చెత్తకు తరచూ, అదీ రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పెట్టడంతో తొలుత మంటలు.. ఆపై దట్టమైన పొగలు ఆ పరసర ప్రాంతాలను కమ్మేస్తున్నాయి. కాలుష్యంతో కూడిన ఈ పొగ పీల్చుతున్న ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని సతమతమవుతున్నారు. డంపింగ్ యార్డ్‌కు సమీపంలోని స్థానిక 28, 29, 30 వార్డుల ప్రజలు ప్రత్యక్షంగా మరో పది వార్డుల ప్రజలు పరోక్షంగా అవస్థలు పడుతున్నారు. డంపింగ్ యార్డ్‌కు మరీ దగ్గరలో ఉన్న బైపాస్ రోడ్డు చెంతనే నివసిస్తున్న కుటుంబాలు, సావరం, కార్మిక నగర్ తదితర ప్రాంతాల ప్రజలైతే ఈ పొగలతో నరకం చూస్తున్నారు. పట్టణంలో జనాభా 54 మంది ఉంటే దాదాపు 25 వేల మంది ప్రజలు దీనివల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల కిందట డంపింగ్ యార్డ్‌ను కలెక్టర్ మహేష్ కుమార్ మున్సిపల్ అధికారులతో కలసి సందర్శించి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. చెత్తను ఎట్టి పరిస్థితుల్లోనూ అంటించవద్దని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇలా చెత్తను అంటించడం వల్ల ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను కలెక్టర్ ప్రస్తావించారు. ఆ ఆదేశాలను కూడా మున్సిపల్ అధికారులు అమలు చేయలేదు. గత వారం రోజుల్లో రెండు సార్లు చెత్తకు నిప్పు పెట్టి దట్టమైన పొగ వెదజల్లడం, ప్రజలు ఎప్పటి లాగే ఇబ్బంది పడడం జరిగిందంటీ కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసినట్లే అయ్యింది. ఇప్పటికే డంపింగ్ యార్డ్ నుంచి తరచూ వచ్చే పొగతో చిన్న పిల్లలు శ్వాసకోశ ఇబ్బందులకు గురై ఆస్పత్రుల పాలయ్యే పరిస్థితి వస్తోందని సావరం ప్రజలు అంటున్నారు.

నిప్పు పెట్టేదెవరు..?

కొండల్లా పెరిగిపోయిన చెత్తకు రాత్రి సమయాల్లో నిప్పు పెట్టడం, తెల్లవార్లూ దట్టమైన పొగలు కమ్మేయడం, మర్నాడు మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్లు పెట్టి నిప్పును చల్లార్చడం వంటి పరిణామాలు తరచూ జరుగుతున్నాయి. అసలే ఈ డంపింగ్ యార్డ్ స్థలం కొరతతో ఇబ్బంది పడుతోంది. ఒక్కోసారి యార్డ్ మొత్తం చెత్తతో నిండిపోవడంతో బైపాస్ రోడ్డు చెంతనే చెత్తను పోయడంతో ప్రజల నుంచి వివాదం అనివార్యమవుతోంది. ఇలా చెత్త పెరిగిపోయినప్పుడల్లా మున్సిపాలిటీ రూ.లక్షలు వెచ్చించి జేసీబీలతో ఎగదోయించడం జరుగుతోంది. పదేళ్లలో దాదాపు రూ.5 కోట్లకు పైగానే చెత్త ఎగదోయడానికి బిల్లులు పెట్టారు. దీనిపై కూడా కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు తెరతీసి వివాదాస్పదమైన సందర్భాలు ఉన్నాయి. చెత్త పెరిగిపోవడంతో పారిశుధ్య సిబ్బందిలోనే ఎవరైనా నిప్పు పెడుతున్నారా..? అనే సందేహం కలుగుతోంది. అధికారులు మాత్రం చెత్త ఏరుకునేందుకు వచ్చిన వారే నిప్పు పెడుతున్నారని చెబుతున్నారు. చెత్త పొరల్లో గ్యాస్ ఉత్పన్నమై ఒక్కోసారి చెత్త లోపల నిప్పు అనివార్యమై మంటల చెలరేగుతున్నాయన్న వాదన ఉన్నప్పటికీ దానికి శాస్త్రీయ ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు లేక వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు.



పొగను అదుపు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇక్కడ ఉండలేకపోతున్నాం



కనీసం నెలలో 10 నుంచి 15 సార్లు చెత్తకు నిప్పు పెడుతున్నారు. మంటల చెలరేగి కొన్ని గంటల పాటు దట్టమైన పొగ రావడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ఆ పొగ పీల్చి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. కొంతమంది శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించినప్పుడు సమస్య తీరుతుందనుకున్నాం. అధికారులు పూర్తి స్థాయిలో స్పందించాలి.

– **మంగళంపల్లి అంజిబాబు**, అధ్యక్షుడు, జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, సావరం బైపాస్ రోడ్డు

నిఘా ఏర్పాటు చేస్తాం

డంపింగ్ యార్డ్ వద్ద చెత్తకు నిప్పు పెట్టే వారిపై నిఘా పెడతామని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. చెత్తను అంటించే సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు బాధ్యులను గుర్తించి చర్యలు చేపడతామన్నారు. పారిశుధ్య సిబ్బందికి కూడా ప్రత్యేక ఆదేశాలు ఇస్తామని చెప్పారు. చెత్త ఏరుకునే వారిని కూడా డంపింగ్ యార్డ్‌కు రాకుండా చర్యలు చేపడతామని కమిషనర్ రాజు వివరించారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం



సదస్సులో మాట్లాడుతున్న పట్టణ ఎస్సై కిషోర్

అమలాపురం రూరల్: అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీలో దళిత బహుజన మహిళా శక్తి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం- మానవ జీవన ప్రమాణాన్ని పెంచుదాం అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. పట్టణ ఎస్సై కిషోర్ మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకూ జరిమానా లేదా జైలుశిక్ష పడుతుందన్నారు. మైనర్ డ్రైవింగ్ చేస్తే మూడేళ్ల జైలు, తండ్రికి రూ. 25 వేల జరిమానా ఉంటుందని అన్నారు. దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 2024 ఏడాదిలో 1.80 లక్షల మంది మరణించారని తెలిపారు. ఇందులో 66 శాతం యువత ఉండడం బాధాకరమన్నారు. 30 వేల మంది హెల్మెట్ ధరించక పోవడం వల్లే చనిపోయారన్నారు. ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్, ఏవీఎస్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జేఏఓగా లోవరాజుకు పదోన్నతి

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న లంక చినలోవరాజుకు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి ఇస్తూ శుక్రవారం ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి రత్నకిషోర్‌చారి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పదోన్నతినిచ్చి వ్యవసాయ శాఖకు బదిలీ చేశారు. అనంతరం జేఏఓగా పదోన్నతి పొందిన లోవరాజు ఆర్ఏఓ మునిసామిని మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు.

సేవలు అభినందనీయం



పీఈటీ ముసలయ్య, స్టేడియం కోచ్ భీమేష్‌లను సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అమలాపురం రూరల్: అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో కోనసీమ క్రీడోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన పీఈటీ ఉండ్రు వెంకట ముసలయ్య, బాలయోగి స్టేడియం బాస్కెట్‌బాల్ కోచ్ ఇళ్ల భీమేష్ సేవలు అభినందనీయమని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. కోనసీమ క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక బాలయోగి స్టేడియంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ముసలయ్య, భీమేష్‌లను కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, జేసీ టి.నిషాంతి, డీఈఓ సలీం బాషా ఘనంగా సత్కరించారు. ఆర్డీఓలు మాధవి, శ్రీకర్, అఖిల పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



చొల్లంగి గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న నందివర్ధన



అమలాపురంలో బాలికా దినోత్సవ ర్యాలీలో ఐసీడీఎస్ అధికారి

తాళ్లరేవు: బాలికల హక్కులను కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. శుక్రవారం చొల్లంగి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ పూజారి పద్మావతి అధ్యక్షతన బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతలపై అవగాహన కల్పించారు. 2008 నుంచి ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించడం, లింగ వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తడం, అసమానతలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా గాడిమొగ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉన్నతంగా స్థిరపడాలి

అమలాపురం టౌన్: బాలికలు విద్యతో పాటు సామాజిక వికాసంతో ఎదిగి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జిల్లా డైరెక్టర్ శాంత కుమారి ఆకాంక్షించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో శాంతకుమారి పాల్గొని ప్రసంగించారు. అనంతరం పాఠశాల నుంచి అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ ప్రతినిధులు పాల్గొని బాలికల ఉన్నతి కోసం నినాదాలు చేశారు. అమలాపురం ఐసీడీఎస్ సీడీపీవో విజయశ్రీ, సూపర్‌వైజర్లు అన్నపూర్ణేశ్వరి, విజయకుమారి, మహేశ్వరి, హెచ్ఎం విజయ కుమారి పాల్గొన్నారు. స్థానిక విద్యానిధి స్కూల్‌లో బాలికల హక్కులపై ఆ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆ విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ టీకాలు



కరపత్రాలు ఇచ్చి పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి నారాయణరావు

అల్లవరం: పశువులకు నట్టల వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని దేవగుప్తం, రెల్లుగడ్డ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించినట్లు పశు వైద్యాధికారి మేడిద నారాయణరావు తెలిపారు. దేవగుప్తం పంచాయతీ పరిధిలో నల్లగంట వద్ద పశు శిబిరాన్ని నిర్వహించి, నట్టల వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను అందించారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు, పశు వైద్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: పాడి రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. ఎస్.కొత్తపల్లిలో పశు వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఉప్పలగుప్తం ఏరియా వైద్య సహాయ సంచాలకులు బి.నాగేశ్వరరావు, వైద్యాధికారి ఎస్.నిరోషా, జేవీవో కేవీ రామరావు, పశు వైద్య సహాయకులు రాజేష్ కిషోర్ పాల్గొన్నారు.

సుంకరపాలెంలో పశు వైద్య శిబిరం

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇంజరం పశు వైద్యాధికారి రమణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్థానిక నాయకులు ప్రారంభించారు. పశు సంరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. సుమారు 60 పశువులను పరీక్షించి అవసరమైన వాటికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, నాయకులు ఎంవీ రెడ్డినాయుడు, చిక్కం హనుమంతరావు, తాతపూడి నాగేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సుంకరపాలెం పశు వైద్య శిబిరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కంటి ఆసుపత్రి ప్రారంభం



కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ జైన్

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్‌లో వెదులపల్లి సత్యనారాయణమూర్తి ఉచిత కంటి ఆసుపత్రిని ఆ సంస్థ జిల్లా ప్రతినిధి శేక్ ఫ అనిల్‌కుమార్ జైన్ ప్రారంభించారు. దీనికి నగర క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. అమలాపురం లయన్స్ క్లబ్‌లో ప్రతి బుధ, శుక్రవారాలు సాయంత్రం మూడు గంటల నుంచి 5 గంటల వరకూ ఉచితంగా పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి ఆపరేషన్లు.. కళ్లజోళ్లు, మందులు ఉచితంగా ఇస్తామని ఐ ట్రస్ట్ చైర్మన్ యర్రమిల్లి విశ్వేశ్వర రావు తెలిపారు. ఐ ట్రస్ట్ కార్యదర్శి పచ్చిగోళ్ల చిన్న రామస్వామి, కోశాధికారి జంపన సుమన్‌వర్మ, లయన్స్ బిల్డింగ్ ట్రస్ట్ చైర్మన్ సుగ్గు గోపి, క్లబ్ కార్యదర్శి మద్దెల వెంకటేశ్వరరావు సభ్యులు పాల్గొన్నారు.

చేయి కోల్పోయిన లాస్యకు రూ.లక్ష సాయం



లాస్య తండ్రికి రూ.లక్ష అందిస్తున్న మంత్రి సుభాష్

అల్లవరం: మండలంలోని గోడి కొత్త కాలనీలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై కాకినాడకు చెందిన కేలా లాస్య, కేతా రమాదేవి తీవ్ర గాయాల పాలైన విషయం విదితమే. విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలపాలైన లాస్యకు జీజీహెచ్ వైద్యులు చేతిని తొలగించి చికిత్స అందిస్తున్నారు. లాస్యను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పరామర్శించారు. లాస్య తండ్రికి రూ.లక్ష నగదుని అందించారు.

మంచు ముసుగు

అమలాపురం టౌన్: పట్టణం శుక్రవారం వేకువ జాము నుంచి ఉదయం 8 గంటల వరకూ మంచు దుప్పట్లోనే ఉంది. బారెడు పొద్దెక్కినా మంచు వీడకపోవడం విశేషం. ఉదయం 10 గంటల తర్వాత పూర్తిగా మంచు తెరలు తొలగి పట్టణంలో స్పష్టమైన వాతావరణం కనిపిందింది. రోజూ ఉదయాన్నే మంచు ఉంటున్నప్పటికీ శుక్రవారం ఉదయం మాత్రం దట్టమైన మంచు పొగలు పట్టణాన్ని చుట్టేశాయి.



అమలాపురంలో మంచు దుప్పటి

మహిమాన్వితుడు కాలభైరవుడు

- చొల్లంగి తీర్థానికి ఏర్పాట్లు
- 29న వేడుకలకు సిద్ధం



బ్రహ్మసమేధ్యం చొల్లంగి తీర్థంలో కాలబైరవస్వామి నూతన ఆలయం

కాట్రేనికోన: పల్లం పంచాయతీ బ్రహ్మసమేధ్యం సముద్ర తీరంలో కాలభైరవస్వామి వెలిశారు. అగ్నికుల క్షత్రియుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందిన కాలభైరవుని తీర్థ మహోత్సవాలు చొల్లంగి అమావాస్య రోజు ఈ నెల 29న అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఆ రోజున సముద్ర స్నానం ఆచరించి స్వామి దర్శించుకోవడంతో సకల పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, సునామీల నుంచి రక్షణ కల్పించే జగద్రక్షకుడిగా కాలభైరవుడు పేరొందారు. ఆధునిక సమాజంలో యువత మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందేందుకు బ్రహ్మసమేధ్యం సముద్ర తీరం అనువైన ప్రాంతం. ఇసుక తిన్నెల్లో ఆహ్లాదకర ప్రకృతి ఒడిలో సేద తీరవచ్చు. యువత కేరింతలతో చలి మంటలు వేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడపవచ్చు. తీర్థానికి వెళ్లేటప్పుడు పల్లం మీదుగా మడ అటవీ ప్రాంతం మధ్యలో గోదావరి పాయ వెంబడి బోటులో ప్రయాణం చక్కటి అనుభూతిని ఇస్తుంది. అప్పుడు రకరకాల అడవి జాతి పక్షులు దర్శనమిస్తాయి. రాత్రివేళ ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించవచ్చు. భక్తులు వేకువజామునే సముద్ర స్నానం చేస్తూ సముద్ర గర్భం నుంచి ఉదయిస్తున్న సూర్య భగవానుడిని దర్శించుకోవచ్చు.

స్వామి పాదముద్రలున్న శిల

తుపాను ప్రభావంతో తాటి చెట్టు ఎత్తున సముద్రం ఎగసిపడి వస్తున్నప్పుడు స్వామి సముద్రానికి ఎదురుగా శిలపై కూర్చుని దంత దావనం చేసుకున్నాడని, సముద్రం వెనుదిరిగి వెళ్లిపోయిందని స్థానికులు చెబుతుంటారు. దీనికి గుర్తుగా ఆలయం ఎదుట స్వామి పాదముద్రలు ఉన్న శిల భూమిలో దిగి ఉంటుంది.

స్వయంభువుగా వెలసి..

బ్రహ్మసమేధ్యం సముద్ర తీరంలో సంతాన మూర్తిగా వెలసిన కాలభైరవుడు స్వయంభువుడు. సుమారు 250 ఏళ్లకు పూర్వం సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పూర్వికులకు కాలభైరవుడు, పార్వతీ సమేత బ్రహ్మేశ్వరుడు (బ్రహ్మ సూతం) ప్రతిమలు వలలో చిక్కుకున్నాయి. స్వయంభువులుగా వెలసిన విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయాలు నిర్మించి ఏటా చొల్లంగి అమావాస్య రోజున చొల్లంగి తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 29న బుధవారం చొల్లంగి తీర్థం కావడంతో భక్తులు ముందు రోజు 28న మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరుకుంటారు. పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, కొత్తపాలెం, మొల్లేటిమొగ తదితర గ్రామాల ప్రజలు ఆలయానికి చేరుకుంటారు. స్వామి ఇష్టమైన క్షీరాన్నాన్ని నైవేద్యంగా పెడతారు.

సంతాన ప్రదాతగా..

పిల్లలు లేని దంపతులు పూజలు చేస్తే సంతానం ప్రసాదించే స్వామిగా కాలభైరవుడు ప్రసిద్ధి చెందారు. సంతానం లేని మహిళలు చొల్లంగి అమావాస్య రోజున రాత్రివేళ సముద్ర స్నానం ఆచరించి తడి వస్త్రాలతో స్వామివారి పాదముద్రలపై పడతారు. తడి వస్త్రాలతో పాదాలపై పడిన మహిళలు నిద్రలోకి జారుకుంటారు. మహిళలకు నిద్రలో స్వామి నిదర్శనం ఇస్తారని ఆలయ అర్చకులు చెబుతుంటారు. సంతానం కలిగిన మహిళలు బిడ్డలతో పాటు స్వామిని దర్శించుకుని అరటి గెలలు, కొబ్బరి మొక్కను మొక్కులుగా చెల్లిస్తారు.

ప్రజల ఆర్థిక సహాయంతో..

పురాతనమైన కాలభైరవస్వామి ఆలయం శిథిలం కావడంతో పల్లం గ్రామ ప్రజల ఆర్థిక సాయంతో అత్యంత అద్భుతంగా నూతన ఆలయాన్ని నిర్మించారు. కేశనకుర్రు గ్రామానికి చెందిన దివంగత గాదిరాజు వెంకట కృష్ణంరాజు జ్ఞాపకార్థం సత్యధనశ్రీ హేచరీస్ అధినేత గాదిరాజు చినసుబ్బరాజు, వెంకటలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో కాలభైరవ స్వామి, బ్రహ్మేశ్వరస్వామి, కనకదుర్గమ్మ, గంగమ్మ ఆలయాలకు పూర్తిగా గ్రానైట్ వేయించారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ధ్వజస్తంభాన్ని, సీఎస్ఆర్ నిధులతో కాంపౌండ్ వాల్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.



ఆలయంలో నిద్రిస్తున్న మహిళలు (ఫైల్)



కాలభైరవస్వామి

ఆలయానికి చేరుకునేదిలా..

ఆలయానికి చేరుకునేందుకు అమలాపురం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. అమలాపురం -పల్లం, అమలాపురం-కాట్రేనికోన, చిర్రయానం మీదుగా నీళ్లరేవుకు బస్సు సౌకర్యం ఉంటుంది. అమలాపురం నుంచి అనాతవరం-ఉప్పలగుప్తం-ఎస్ కొత్తపల్లి, గచ్చకాయలపోర-చిర్రయానం మీదుగా చొల్లంగి తీర్థానికి చేరుకోవచ్చు.